సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.23,390

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.23,390, కనిష్టంగా రూ.5,500, సరాసరిన రూ.12 వేల ధర పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.9 ప్రకారం ధర పలికింది.



జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉదయం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రహదారుల కోసం భూసేకరణ వేగవంతం

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ



ప్రశాంతి నిలయం: జిల్లా పరిధిలో నిర్మించనున్న జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ చేస్తామని భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి. జయశ్రీ తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కోలో ఎస్టేట్ ఆఫీసర్‌గా విజయవాడలో పనిచేస్తూ పదోన్నతిపై జిల్లా భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన జయశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లా పరిధిలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, ఎన్‌హెచ్-342, 716జీ జాతీయ రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఆయా రహదారులకు అవసరమైన భూమి సేకరించే ప్రక్రియ మరింత వేగవంతం చేస్తామన్నారు. అలాగే రైతులకు త్వరితగతిన పరిహారం అందించడంతోపాటు రహదారులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతామన్నారు.

భూ సమస్యలు పునరావృతం కారాదు

- రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా



రెవెన్యూ అంశాలపై సమీక్షిస్తున్న ఆర్‌పీ సిసోడియా

ప్రశాంతి నిలయం: జిల్లాలో భూముల రీసర్వేను పకడ్బందీగా చేపట్టి భవిష్యత్తులో రైతులకు భూ సమస్యలు తలెత్తకుండా రికార్డులు పక్కాగా రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాకు విచ్చేసిన ఆయన.. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్, రీ సర్వే, రెవెన్యూ సదస్సులతో పాటు పలు రెవెన్యూ అంశాలపై కలెక్టర్ టీఎస్ చేతన్‌తో కలసి అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భూముల వర్గీకరణతో కూడిన మ్యాప్‌లు తయారు చేయాలన్నారు. భూముల రిజిస్ట్రేషన్, 22ఏ, డి.నోటిఫైడ్, భూసేకరణ, సమీకరణ, ఫ్రీహోల్డ్, డిజిటలైజేషన్, జాయింట్ ఎల్‌పీఎంల రూపకల్పనతో పాటు ఇతర రెవెన్యూ అంశాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి అధికారులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్వో విజయసారథి, ఆర్డీఓలు సువర్ణ, శర్మ, మహేష్, ఆనంద్‌కుమార్, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధనే ధ్యేయం



సమీక్షిస్తున్న లంకా దినకర్, చిత్రంలో కలెక్టర్

ప్రశాంతి నిలయం: వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. ఇందుకోసం జిల్లాలో 20 సూత్రాల అమలు కార్యక్రమం పటిష్టంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 20 సూత్రాల కార్యక్రమం అమలుపై వివిధ శాఖల అధికారులతో చైర్మన్ లంకా దినకర్, కలెక్టర్ టీఎస్ చేతన్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర పథకాల అమలు, వివిధ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి చేపట్టిన 10 అంశాలను సంబంధించిన వివరాలను కలెక్టర్ చేతన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్, లక్ పతి దీదీ, జాతీయ ఆహార భద్రతా చట్టం, రాష్ట్రీయ గోకుల్ మిషన్ తదితర ప్రాజెక్టులు జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. రాయలసీమ టూరిజం సర్క్యూట్‌లో భాగంగా లేపాక్షి-పెనుకొండలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు ముందే చిత్రావతి సుందరీకరణ పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతు కంట్లో కారం!





చందకచెర్లలో రైతు మారుతి ప్రసాద్ ఇంటిలో నిల్వ ఉంచిన మిర్చి బస్తాలు

మడకశిర మండలం చందకచెర్లు గ్రామంలోని రైతు మారుతి ప్రసాద్ ఇంట్లో నిల్వ ఉంచిన ఎండుమిర్చి ఇది. రెండెకరాల్లో మిర్చికి కూలీలు, మందులు అన్నీ కలిపి రూ.1.50 లక్షలు పెట్టుబడి అయ్యింది. తెగుళ్లతో దిగుబడి బాగా తగ్గింది. మరోవైపు మార్కెట్‌లో ఆశించిన ధర లేదు. దీంతో మిర్చిని ఎండబెట్టి... ఇంట్లోనే నిల్వ ఉంచాడు. ప్రస్తుతం పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మారుతి ప్రసాద్ అల్లాడిపోతున్నాడు.

మిర్చి రైతు దిగాలు

- భారీగా పడిపోయిన ఎండుమిర్చి ధర
- గత ఏడాది క్వింటా గరిష్టంగా రూ.35 వేలు
- ఈసారి గరిష్టంగా రూ.19 వేలు కూడా పలకని వైనం
- ఇప్పటికే కోల్డ్ స్టోరేజీల్లో పేరుకుపోయిన నిల్వలు
- ఆందోళనలో రైతులు.. 'గిట్టుబాటు' కోసం వేడుకోలు



పరిగి మండలం ఊటుకూరు వద్ద తేజప్ప అనే రైతు పొలంలోనే వదిలేసిన మిరప పంట

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి రైతు కంట్లో నీళ్లు తెప్పిస్తోంది. మార్కెట్‌లో ఆశించినంత ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితులు కనిపించడం లేదు. మరోవైపు ఇప్పటికే సరుకును కోల్డ్‌స్టోరేజీలో నిల్వ ఉంచిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

తగ్గిన దిగుబడి..

ఈ ఏడాది జిల్లా రైతులు 1.32 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల మధ్య దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అయితే అందుకు భిన్నంగా ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల లోపే దిగుబడులు వచ్చాయి. ఇక కర్ణాటకలోని మధుగిరి, చెలికెర ప్రాంతాల నుంచి వచ్చే సరుకు కూడా తగ్గింది. అనంతపురం, కర్నూలు ప్రాంతాల నుంచి సైతం అంతంత మాత్రంగా ఎండు మిర్చి వచ్చింది. పైగా చీడపీడలు పంటను భారీగా దెబ్బతీశాయి. కూటమి ప్రభుత్వంలో నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో తెగుళ్ల, చీడపీడలు విజృంభించడంతో దిగుబడులు సగానికి తగ్గాయి. వచ్చిన సరుకు కూడా నాణ్యతగా లేకపోవడంతో ధర భారీగా పడిపోయింది.

హిందూపురం మార్కెట్‌కు గత మూడేళ్లలో వచ్చిన సరుకు, ధర (క్వింటాలుకు) ఇలా..

సంవత్సరం	మార్కెట్‌కు వచ్చిన సరుకు	గరిష్ట ధర	కనిష్ట ధర
2021-22	18,661.30 క్వింటాళ్లు	రూ.25,000	రూ.4,500
2022-23	8,376.33 క్వింటాళ్లు	రూ.3,0000	రూ.6,000
2023-24	15,476.30 క్వింటాళ్లు	రూ.3,5000	రూ.7,000
2024-25	12,955.05 క్వింటాళ్లు	రూ.18,500	రూ.7,000

రూ.19 వేలు కూడా పలకని వైనం..

హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళ, శుక్రవారాల్లో ఎండుమిర్చి క్రయవిక్రయాలు జరుగుతాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా రైతులు మిర్చిని ఇక్కడికే తీసుకువస్తుంటారు. గత మూడేళ్ల క్రయవిక్రయాలు పరిశీలిస్తే హిందూపురం మిర్చి యార్డుకు 55,500 క్వింటాళ్లకుపైగా పంట వచ్చింది. 2023-24 సంవత్సరంలో అత్యధికంగా క్వింటా నాణ్యమైన మిర్చి రూ.35 వేల మేర పలికింది. ఈ ఏడాది ఇప్పటివరకు మార్కెట్‌కు 12,955 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా, క్వింటా గరిష్ట ధర రూ.18,500 మాత్రమే పలికింది. దీంతో మిర్చిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతుల కంట కన్నీరే మిగిలింది.

ఆదుకోని ప్రభుత్వం..

మిర్చి సాగుకు రూ.లక్షలు పెట్టుబడి పెట్టి కుటుంబంతో కలిసి ఆరుగాలం శ్రమించిన రైతుకు ధర పతనంతో తీవ్ర నిరాశ మిగిలింది. క్వింటా రూ.19 వేలు కూడా పలకని పరిస్థితుల్లో నిండా మునిగిపోయాడు. మరోవైపు ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. ధర తగ్గిన సమయంలో మార్క్‌ఫెడ్, ఇతర ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోళ్లు చేసి రైతును ఆదుకోవాల్సి ఉన్నా... ఇప్పటి వరకూ క్వింటా మిర్చి కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతు పరిస్థితి అమగ్యగోచరమైంది.

కోల్డ్ స్టోరేజ్‌లలో భారీగా నిల్వలు..

ఎండు మిర్చికి మంచి ధర వస్తుందని భావించిన వ్యాపారులు ఇప్పటికే కొనుగోలు చేసిన పంటను హిందూపురం సమీపంలోని కోల్డ్ స్టోరేజ్‌ల్లో నింపేశారు. ప్రస్తుతం మంచి ధర లేకపోవడంతో మిర్చి విక్రయించేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో గోదాముల్లో ఎండుమిర్చి నిల్వలు భారీగా పేరుకుపోయాయి.

రైతు కష్టం వృథా



ఏడాది క్రితం ఎండు మిర్చి క్వింటా రూ.35 వేలు పలికింది. ఈ సారి క్వింటా రూ.19 వేలు కూడా పలకడం లేదు. రూ.లక్షలు పెట్టుబడితో పాటు రైతు కష్టం కూడా వృథా అవుతోంది. ఒక్క హిందూపురంలోనే 200 లారీల వరకు మిర్చి నిల్వ ఉంది. ధరల పతనంతో రైతులే కాదు వ్యాపారులూ నష్ట పోయారు.

– వేణుగోపాలరెడ్డి, కోల్డ్ స్టోరేజ్ యజమాని, హిందూపురం

తెగుళ్లతో ధర పతనం



వర్షాలు, తెగుళ్ల ప్రభావం ఈ సారి ఎండుమిర్చి దిగుబడిపై చూపింది. ప్రస్తుతం మార్కెట్‌లో తెల్లమచ్చల సరుకే ఎక్కువగా కనిపిస్తోంది. అందువల్లే ధర తగ్గింది. దీనికితోడు గత ఏడాది కోల్డ్ స్టోరేజీల్లో భారీగా నిల్వలు ఉంచిన సరుకు కూడా కదలడం లేదు. నాణ్యత సరిగా లేకపోవడంతో వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఫలితంగా మార్కెట్‌లో క్రయవిక్రయాలు తగ్గాయి.

– జి. చంద్రమౌళి, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి, హిందూపురం

హంద్రీ–నీవా లైనింగ్ పనుల అడ్డగింత

- కాలువకు సిమెంట్ లైనింగ్ వల్ల భూగర్భజలమట్టం తగ్గుతుంది
- తమకు అన్యాయం చేయవద్దని రైతుల వేడుకోలు



తగరకుంట వద్ద హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులను అడ్డుకున్న రైతులు

కనగానపల్లి: హంద్రీ–నీవా కాలువ సిమెంట్ లైనింగ్ పనులను రైతులు అడ్డుకున్నారు. ఎవరికో మేలు చేసేందుకు తమకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. తగరకుంట సమీపంలోని హంద్రీ–నీవా కాలువ వద్ద లైనింగ్ పనులు చేపట్టేందుకు బుధవారం కాంట్రాక్టర్లు యంత్రాలతో రాగా, విషయం తెలుసుకున్న స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు అక్కడికి వెళ్లి పనులు చేపట్టకూడదన్నారు. కూటమి ప్రభుత్వం హంద్రీ–నీవా కాలువ ద్వారా చిత్తూరు జిల్లాకు కృష్ణాజలాలు తరలించేందుకు తమకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. కాలువ వెడల్పు, జంగిల్ క్లియరెన్స్‌కు తాము వ్యతిరేకం కాదన్నారు. కానీ కాలువకు సిమెంట్ వేసి లైనింగ్ చేస్తే ఒప్పుకోబోమన్నారు. దీనివల్ల కాలువ సమీపంలో భూగర్భజలమట్టంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో తగరకుంట, పాతపాల్యం గ్రామాల సర్పంచ్‌లు మాధవరాజులు, రాజాకృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

సుత్తితో కొట్టి.. నగల అపహరణ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ

ఓడీచెరువు: రాత్రి వేళ ఓ ఇంటి తలుపుతట్టిన దుండగులు...డోరు తీసిన మహిళ నెత్తిపై సుత్తితో కొట్టి ఆమె వంటిపై ఉన్న ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం రాత్రి ఓడీచెరువులో చోటుచేసుకుంది. బాధితురాలు పోలీసులకు తెలిపిన వివరాల మేరకు... వైద్య,ఆరోగ్యశాఖ విశ్రాంత ఉద్యోగి లక్ష్మమ్మ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోనే ఒంటరిగా నివాసం ఉంటోంది. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఆమె ఇంట్లో నిద్రిస్తుండగా...దుండగులు తలుపుతట్టి పేరుపెట్టి పిలిచారు. దీంతో ఆమె తలుపుతీయగానే సుత్తితో తలపై కొట్టారు. ఈ హఠాత్పరిణామంతో లక్ష్మమ్మ అక్కడే స్పృహ తప్పి పడిపోయింది. దీంతో దుండగులు ఆమె మెడలోని గొలుసు, చేతికున్న బంగారు గాజులు తీసుకెళ్లిపోయారు. ఆ తర్వాత లక్ష్మమ్మకు ఎప్పటికో మెలకువ రాగా, అతికష్టమ్మీద తన కూతురుకు ఫోన్ చేసి విషయం తెలిపింది. దీంతో ఆమె వచ్చి లక్ష్మమ్మను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లింది. అనంతరం స్థానిక పోలీసులకు ఈ ఘటనపై ఫిర్యాదు చేసింది. మొత్తంగా 14 తులాల బంగారు నగలు దుండగులు అపహరించినట్లు పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆహారం కలుషితం..

విద్యార్థినులకు అస్వస్థత





కనగానపల్లి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న మోడల్ స్కూల్ విద్యార్థినులు

- కనగానపల్లి మోడల్ స్కూల్లో ఘటన
- పీహెచ్‌సీలో విద్యార్థినులకు చికిత్స
- ముగ్గురిని అనంతపురం సర్వజనాస్పత్రికి తరలింపు

కనగానపల్లి: కలుషిత ఆహారం తిని స్థానిక మోడల్ స్కూల్‌లోని పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. మోడల్ స్కూల్ హాస్టల్లో ఉంటున్న పలువురు విద్యార్థినులు మంగళవారం రాత్రి కడుపునొప్పి, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో హాస్టల్ సిబ్బంది వారిని వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి వైద్యం చేయించారు. బుధవారం ఉదయం కూడా మరో 10 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా, వారిని కూడా పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు. వీరిలో ఏడుగురి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడగా డిశ్చార్జ్ చేశారు. మిగిలిన ముగ్గురు (తులసి, కళావతి, మానస) విద్యార్థినులను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆహారం, నీరు కలుషితం కావడం వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు.

విద్యార్థినులను పరామర్శించిన డీఎంహెచ్‌ఓ



హాస్టల్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం

కనగానపల్లి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న మోడల్ స్కూల్ విద్యార్థినులను డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం ఆమె మోడల్ స్కూల్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే సునీత కూడా పీహెచ్‌సీకి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం మోడల్ స్కూల్ హాస్టల్‌ను పరిశీలించారు. అక్కడ నెలకొన్న అపరిశుభ్ర వాతావరణాన్ని చూసి విద్యాశాఖ అధికారులు, హాస్టల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

కింద పడి వ్యక్తి మృతి



భాస్కర్ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: ఉన్నఫళంగా రోడ్డుపై కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన గార్లదిన్నె భాస్కర్ (40)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నడుచుకుంటూ ఇంటికి వెళుతున్న ఆయన రోడ్డుపై ఉన్నఫళంగా కుప్పకూలాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్సకు స్పందించక బుధవారం తెల్లవారుజామున ఆయన మృతి చెందాడు.

యువకుడి ఆత్మహత్య



అశోక్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని సత్యసాయి నగర్‌కు చెందిన అశోక్ (35) ఇటుకల బట్టీతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలయ్యాడు. దీంతో ఆన్‌లైన్ అప్పులు తీర్చేందుకు ఇంటిని తాకట్టు పెట్టి రూ.8 లక్షలు తీసుకున్నాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక కొంత కాలంగా మదన పడుతున్న అశోక్ బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై చెన్నేకొత్తపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ ప్యాదిండి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య ఉంది. లోకో పైలట్ ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

దానిమ్మ తోట దగ్ధం

- రూ.5లక్షలు నష్టపోయిన రైతులు



కాలిపోయిన దానిమ్మ చెట్లు

బత్తలపల్లి: ఆకతాయిల చేష్టలకు రూ.5లక్షలను రైతులు నష్టపోయారు. బీడు పొలంలో ఎండిన గడ్డికి నిప్పు పెట్టడంతో బోరు బావులు కింద సాగు చేసిన పంటలు అగ్నికి ఆహుతయ్యాయి. వివరాలు.. బత్తలపల్లికి చెందిన రైతులు గడిపూటి శేషయ్య, రామానాయుడు, రమేష్‌బాబు, గోపీనాథ్‌కు ముష్టూరు రెవెన్యూ పరిధిలో మొత్తం పది ఎకరాల పొలం ఉంది. ఏడేళ్లుగా ఈ పొలంలో 3,250 దానిమ్మ చెట్లను పోషిస్తూ వస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం ఈ పొలానికి సమీపంలో ఉన్న బీడు భూమిలో ఎండు గడ్డికి కొందరు నిప్పు రాజేశారు. చూస్తుండగానే మంటలు ఉధృతంగా చెలరేగి తోటను చుట్టుముట్టాయి. దానిమ్మ చెట్లతో పాటు డ్రిప్ పరికరాలు, మూడు స్టార్టర్లు, విద్యుత్ కేబుల్ కాలిపోయాయి. ఘటనతో రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.

లంచం కొట్టు.. దస్త్రం పట్టు

- అవినీతికి నిలయంగా మారిన ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- దస్తావేజు, సెంట్‌కు వేర్వేరుగా ధర నిర్ణయించిన వైనం
- కూటమి పార్టీల నేతల అండతో యథేచ్ఛగా అవినీతి
- లంచాలు ఇవ్వకపోతే నెలల తరబడి పెండింగ్‌లో దస్తావేజులు
- గడచిన 8 నెలల్లో గణనీయంగా తగ్గిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

కంచె చేను మేసిన చందంగా అందిన కాడికి దండుకుంటున్నారు రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు . ఎంతలా అంటే లంచం ముట్టజెప్పందే ఒక్క పనీ చేయడం లేదు. ఇందు కోసం ప్రత్యేకంగా ఏజెంట్లను నియమించుకుని అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఈ మొత్తం ప్రక్రియ కూటమి నేతల కనుసన్నల్లోనే జరుగుతుండడం గమనార్హం. తమ స్వలాభం కోసం అవినీతి అధికారులకు నేతలు వత్తాసు పలుకుతుండడంతో సామాన్య ప్రజల జేబులు ఖాళీ అవుతున్నాయి.



ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తూ సబ్‌రిజిస్ట్రార్‌కు ఆదేశాలిస్తున్న మంత్రి సత్యకుమార్ పీఏ హరీష్‌బాబు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ధర్మవరంలోని సబ్ రిజిస్ట్రార్ అధికారులపై పెత్తనం చెలాయిస్తూ కార్యాలయాన్ని అవినీతికి నిలయంగా మార్చేశారు. దీంతో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు సెంట్‌కు ఒక రేటు, ఎకరానికి ఒక రేటు చొప్పున ధరను అధికారులు నిర్ణయించి అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఇక్కడ అధికారులు చెప్పిన ధర చెల్లించకపోతే పని ముందుకు సాగడం లేదు. అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నా లంచం ఇవ్వని వారి దస్తావేజులను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచేస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో దస్తావేజుల లేఖరుల ఏజెంట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం. స్వీకరించిన అవినీతి సొమ్ములో కూటమి పార్టీల నేతలకు కొంత ముడుపులు చెల్లిస్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం.

ఏటా రూ.150 కోట్ల ఆదాయం..


జిల్లాలో అత్యధిక రిజిస్ట్రేషన్‌లు జరిగే ప్రాంతాలలో ధర్మవరం ఒకటి. గతంలో ఒక్క ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో నెలకు 500 నుంచి 800 వరకు దస్తావేజులు రిజిస్టర్ అయ్యేవి. తద్వారా ప్రభుత్వానికి రూ.1.20కోట్ల నుంచి రూ.1.50కోట్ల వరకూ ఆదాయం సమకూరేది. అప్పట్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రాజకీయ జోక్యం ఉండేది కాదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుండటంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ భారీగా జరుగుతుండేది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తిష్టవేసి లావాదేవీలన్నీ పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్నారు. వారు రిజిస్టర్ చేయమంటే అధికారులు చేస్తారు.. వద్దు అంటే ఆపేస్తున్నారు.

మూడు భాగాలుగా పంచుకున్న నేతలు..

ధర్మవరం పట్టణాన్ని మూడు భాగాలుగా విభజించి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పంచుకున్నట్లుగా సమాచారం. పట్టణంలోని బెంగుళూరు రోడ్డు, పుట్టపర్తి రోడ్డు వైపు రిజిస్ట్రేషన్లు టీడీపీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నాయి. అనంతపురం రోడ్డు వైపు బీజేపీ నాయకులు, రేగాటిపల్లి జాతీయ రహదారి వైపు జనసేన నాయకుల పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి. ఈ మేరకు ఆయా పార్టీల నాయకులు ఒప్పందం చేసుకుని మరీ అక్రమాలకు తెరలేపారు. ఈ మూడు ప్రాంతాల్లో ఎక్కడైన వెంచర్ వేయాలన్నా, గతంలో వేసిన వెంచర్‌లకు సంభందించిన ప్లాట్లు రిజిస్టర్ చేయాలన్నా ఆయా పార్టీల నాయకులకు కప్పం చెల్లించి అనుమతి తీసుకుంటేనే రిజిస్ట్రేషన్‌కు అధికారులు ఆమోద ముద్ర వేస్తున్నారు. ఈ దోపిడీ స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా మందగించింది. ఒకప్పుడు 800 వరకు జరిగిన రిజిస్ట్రేషన్లు ప్రస్తుతం 200 నుంచి 300కు మించడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడింది.

మంత్రి పీఏ హల్‌చల్

ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను మంత్రి సత్యకుమార్ పీఏ హరీష్‌బాబు తరచుగా తనిఖీ చేస్తూ వివరాలు ఆరా తీస్తుండడం విమర్శలకు తావిస్తోంది. తనదైన శైలిలో కార్యాలయ అధికారులను, సిబ్బందిని బెదిరిస్తూ అంతా తాను చెప్పినట్లే నడుచుకోవాలని హెచ్చరించినట్లుగా సమాచారం. ఎమ్మెల్యే, మంత్రి హోదాలో చేయాల్సిన తనిఖీలను ఓ పీఏ చేపట్టడం ధర్మవరం చరిత్రలో ఇంత వరకూ ఎన్నడూ జరగలేదని రియల్టర్లు అంటున్నారు. అలాగే టీడీపీ, జనసేన నాయకులు క్రమం తప్పకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి తాము చెప్పినట్లే రిజిస్ట్రేషన్లు జరగాలని అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరగడం ప్రశ్నార్థకమేనని రియల్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



స్థలాన్ని బట్టి ధర..

కూటమి నాయకులకు కప్పం కట్టి వారి అనుమతి తీసుకుని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోకి అడుగు పెట్టగానే అక్కడ కూడా లంచం ఇవ్వందే పని జరగడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కార్యాలయంలో సెంటుకు రూ.3వేలు చొప్పున లంచం ముట్టచెప్పాల్సి వస్తోందని పలువురు అంటున్నారు. ఎకరానికి అయితే రూ.50వేలు నుంచి రూ.లక్ష వరకు అధికారులు డిమాండ్ చేస్తున్నారని వాపోతున్నారు. ఈ లంచాన్ని కూడా దస్తావేజు లేఖరుల ద్వారా కార్యాలయ ఉన్నతాధికారి అందుకుంటున్నట్లు సమాచారం.

ఉచిత ఎంబీఏ విద్య కోసం 23న పరీక్ష



పోస్టర్లు విడుదల చేస్తున్న యాజమాన్యం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి కళాశాలలో ఉచిత ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే సాయి ప్రుడెంట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఈ నెల 23 ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం విద్యాసంస్థల చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి విడుదల చేశారు. అడ్మిషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రశాంతి, ప్రిన్సిపాల్ అండ్ డీన్ డాక్టర్ బాలకోటేశ్వరి మాట్లాడుతూ రెండేళ్ల ఎంబీఏ విద్యతో పాటు హాస్టల్ సౌకర్యాలను పొందడానికి సాయి ప్రుడెంట్ స్కాలర్‌షిప్ పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ కోర్సు చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 91000 64545, 91009 74544, 91009 74537 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జర్మనీకి చెందిన అన్‌హటా స్టఫ్టుంగ్ ఫౌండేషన్ సహకారంతో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రశాంతి నిలయం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకం, బ్యూటీషియన్, టైలరింగ్‌పై నైపుణ్యాభివృద్ధి శిక్షణను ఉచితంగా అందించనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పది, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన 18 నుంచి 38 సంవత్సరాల్లోపు ఉన్న యువతీయువకులు అర్హులు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ ఉన్న ఫోన్ నంబర్‌ను నమోదు చేసిన దరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోపు పుట్టపర్తిలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో అందజేయాలి. నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ అనంతరం కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ అందజేసి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. లేదా, సొంతంగా వ్యాపారం చేసుకోవాలనుకునేవారికి బ్యాంక్ ద్వారా రుణ సదుపాయం కల్పిస్తారు. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ సెంటర్ కో–ఆర్డినేటర్ సాయి గణేష్ (99666 82246, 79899 23515)ను సంప్రదించవచ్చు.

భార్యను భయపెట్టాలని భర్త డ్రామా



కదిరిలో నాగభూషణ, వారి పిల్లలు

బత్తలపల్లి: భార్యాభర్తలు గొడవపడ్డారు. భర్త పిల్లలను తీసుకుని చనిపోతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. భయపడిపోయిన భార్య మరిది ద్వారా డయల్ 100కు ఫోన్ చేయించడంతో పోలీసులు సెల్‌నంబర్ లొకేషన్ తెలుసుకుని సురక్షితంగా వారిని కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. గంటాపురం గ్రామానికి చెందిన కురుబ నాగభూషణ, వీరదేవి దంపతులు. వీరికి ఇద్దరు సంతానం. నాగభూషణ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తాగుడు మానాలంటూ భర్తతో గొడవపడింది. మనస్తాపానికి గురైన నాగభూషణ తాను ఇక బతకనని చెప్పి ఇంట్లోనే సెల్‌ఫోన్ వదిలేసి వెళ్లిపోయాడు. బత్తలపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్న కుమారుడు, కుమార్తెను పిలుచుకెళ్లాడు. సాయంత్రమైనా పిల్లలు ఇంటికి రాకపోవడంతో వీరదేవి కుటుంబ సభ్యులతో విషయం తెలిపింది. దీంతో నాగభూషణ తమ్ముడు హరి డయల్ 100కు ఫోన్ చేసి జరిగిన విషయం తెలిపాడు. ఇంతలో వీరదేవి సెల్‌కు నాగభూషణ ఫోన్ చేసి పిల్లలతో కలిసి వెళ్లిపోతున్నానని చెప్పి పెట్టేశాడు. తన భర్త కాల్ చేసిన విషయం పోలీసులకు తెలియజేయడంతో వారు సదరు సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా పోలీసులు, బాధితుల బంధువులు కదిరికి వెళ్లి నాగభూషణతో పాటు పిల్లలను తీసుకువచ్చారు. ఎస్‌ఐ సోమశేఖర్ కౌన్సెలింగ్ నిర్వహించగా.. తన భార్యను భయపెట్టేందుకు పిల్లలను చంపి, తాను చస్తానని బెదిరించానని తెలిపాడు. ఇలాంటి ఆకతాయి పనులకు దూరంగా ఉండాలని, భార్యాభర్తలు కలిసిమెలిసి జీవించాలని హితవు పలికారు. ఇకపై అన్యోన్యంగా ఉంటామంటూ తెలిపి స్టేషన్ నుంచి ఇంటికి వెళ్లిపోయారన్నారు. సకాలంలో స్పందించిన పోలీసులను ఎస్పీ రత్న, డీఎస్పీ హేమంత్‌కుమార్, ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్‌లు అభినందించారు.

ఏఆర్ సిబ్బంది సంక్షేమానికి కృషి

- పోలీస్ దర్బార్ కార్యక్రమంలో ఎస్పీ రత్న



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ఏఆర్ సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎస్పీ రత్న తెలిపారు. ఏఆర్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి స్థానిక పోలీస్ కార్యాలయంలో బుధవారం పోలీస్ దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బకాయిలు, బదిలీలు, డిప్యూటేషన్లు, తదితర సమస్యలను ఎస్పీ దృష్టికి ఏఆర్ కానిస్టేబుళ్లు తీసుకెళ్లారు. తమ సమస్యలు దృష్టిలో ఉంచుకుని టర్న్‌వైజ్ రొటీన్ పద్ధతిలో సీనియారిటీ ఉన్న వారిని జిల్లాల విభజన సమయంలో ఉద్యోగుల స్థానికత ఆధారంగా ఆయా జిల్లాలు కేటాయించాలని కోరారు. జిల్లా విభజన సమయంలో ఏఆర్ సిబ్బందిని బ్యాచ్ వైజ్ సీనియారిటీ ఆధారంగా ఒక ఏడాది పాటు ఆర్డర్ టు సర్వీస్ అని చెప్పి పాస్‌పోర్టు ఇచ్చి పంపారన్నారు. ప్రస్తుతం తాము శ్రీసత్యసాయి జిల్లాకు వచ్చి 30 నెలలు అవుతోందని ఇప్పటికైనా తమకు సొంత జిల్లాకు పంపాలని వేడుకున్నారు. సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని ఎస్పీ భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏఓ సుజాత, ఆర్‌ఐ వలి, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

అగళి: తాళం వేసిన ఇంట్లో దుండగులు చొరబడి విలువైన బంగారు, వెండి సామగ్రిని అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు... అగళి మండలం ఎంఎం పాళ్యం గ్రామానికి చెందిన ఓబుళప్ప, ప్రేమకుమారి దంపతులు ఈ నెల 17న ఇంటికి తాళం వేసి కర్ణాటకలోని దొడ్డరి గ్రామంలో జరిగే జాతరకు వెళ్లారు. విషయాన్ని గుర్తించిన దుండగులు ఇంటి తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాను ధ్వంసం చేశారు. అందులో దాచిన 50 గ్రాముల బంగారు నెక్లెస్, 250 గ్రాముల వెండి సామగ్రిని అపహరించారు. బుధవారం ఇంటికి చేరుకున్న ఓబుళప్ప దంపతులు తలుపులు తీసి ఉండడంతో గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ వీరేష్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బాడుగకిస్తే బాధే మిగులుతోంది!

- అనంతపురం రాజు రోడ్డులోని ఓ ఆప్టికల్ (కళ్లద్దాల) భవనాన్ని భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి కొనుగోలు చేశారు. అనంతరం అమ్మిన వ్యక్తికే అద్దెకిచ్చారు. ఆ తర్వాత భాస్కర్ రెడ్డికి సదరు వ్యక్తి అద్దె ఇవ్వకుండా మొండికేశారు. తన బంధువులతో కోర్టులో కేసు వేయించారు. అష్టకష్టాలు పడిన భాస్కర్ రెడ్డి ఎలాగోలా మూడేళ్ల తర్వాత తన భవనాన్ని సొంతం చేసుకోగలిగారు.
- భవనానికి బాడుగ ఇవ్వక, ఖాళీ చేయక ఇబ్బంది పెడుతున్నారని ఇటీవల ఓ ఫిర్యాదుదారు అనంతపురం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఈ కేసులో విచారణ కోసం పోలీసులు ఓ న్యాయవాదిని పిలవగా.. ఆయన గుండెపోటుతో మృతి చెందారు. ఈ రెండే కాదు.. జిల్లాఅంతటా ఇదే పరిస్థితి. అద్దెకు తీసుకున్న వాళ్లు సరిగా బాడుగ డబ్బు కట్టక, భవనాన్ని ఖాళీ చేయకపోవడంతో ఓనర్లు నానా తంటాలు పడుతున్నారు.

- భవనాలను ఖాళీ చేయని అద్దెదారులు
- అవసరమైతే కోర్టులకు వెళ్లి స్టే ఆర్డర్లు
- చేసేది లేక పోలీసులను ఆశ్రయిస్తున్న ఓనర్లు
- పోలీసుల వద్దకు రోజుకు 10 పైనే కేసులు



వివాదానికి కేంద్ర బిందువైన క్రాంతి హాస్పిటల్ భవనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'మనవాళ్లే కదా.. అంతా బాగుంటుంది లే' అనుకుంటూ భవనాన్ని అద్దెకిచ్చిన పాపానికి ఓనర్లు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. అద్దెదారులు చివరకు 'ఖాళీ చేయం.. నీ దిక్కున్న చోట చెప్పుకో' అంటూ ధిక్కరిస్తున్న పరిస్థితి. పైగా కోర్టుకు వెళ్లడం.. ఇప్పుడే ఖాళీ చేయలేమని గడువుతో కూడిన స్టే ఆర్డర్ తెచ్చుకోవడం.. ఆ గడువు కూడా ముగిసినా ఖాళీ చేయకపోవడం... ఇదీ దుస్థితి. ఈ క్రమంలో పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో భవన యజమానులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అద్దె కరెక్టుగా ఇచ్చేవారికి కూడా కొందరి ఆగడాలతో బాడుగకు భవనం దొరకడం కష్టతరమవుతోంది.

'క్రాంతి'.. భ్రాంతి

అనంతపురం గుత్తిరోడ్డులోని ఓ అద్దె భవనంలో క్రాంతి హాస్పిటల్ నడుస్తోంది. నెలకు అద్దె రూ.3.25 లక్షలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. 2021లోనే భవనం అద్దె లీజు ముగిసింది. ఈ క్రమంలో భవనాన్ని ఖాళీ చేయాలని అనేక సార్లు ఓనరు అడిగినా స్పందన లేకుండా పోయింది. పైగా గడిచిన 14 నెలల నుంచి అద్దె కూడా చెల్లించలేదు. దీంతో భవన యజమాని నగేష్ 2024 డిసెంబరులో ఎస్పీకి ఫిర్యాదు చేయగా... పరిష్కారం చూపాలంటూ అనంతపురం త్రీ టౌన్ పోలీసులను ఆయన ఆదేశించారు. అయితే, సదరు పోలీసుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆస్పత్రి వద్ద భవన యజమాని బుధవారం ధర్నాకు దిగారు. ఈ క్రమంలో ఆస్పత్రి నిర్వాహకుడు మురళి దిగిరాకపోగా బాధితుడిపైనే దౌర్జన్యం చేశారు. 'దిక్కున్న చోట చెప్పుకో' అంటూ బెదిరించాడని నగేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

వందలాది కేసులు..

అనంతపురంలోనే కాదు కళ్యాణదుర్గం, రాయదుర్గం, ధర్మవరం, కదిరి, గుంతకల్లు పట్టణాల్లోనూ ఇలాంటి కేసులు ఉత్పన్నమవుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సగటున రోజుకు 10 కేసులు నమోదవుతున్నాయి. అద్దెకున్న వారు ఖాళీ చేయకపోవడంతో బిల్డింగ్ యజమానులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కొంతమంది విదేశాల్లో ఉంటూ ఇక్కడ అద్దెకిస్తే ఆ ఇళ్లకు ఏకంగా ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి కుదువకు పెట్టిన వారూ ఉన్నట్లు సమాచారం.

అద్దె ఇప్పించే ఉద్యోగం కాదు మాది

అద్దెకిచ్చిన ఇంటికి రెంటు ఇప్పించడమో, ఖాళీ చేయించేడమో చేసే ఉద్యోగం కాదు మాది. ఇలాంటి వాటి జోలికొస్తే సివిల్ పంచాయితీల్లో ఎందుకు తలదూరుస్తారు అంటారు. అందుకే కోర్టుకెళ్లి తేల్చుకోండి అని చెబుతున్నాం. మా పరిధిలో ఉన్నవి మాత్రమే చేస్తాం.

– శాంతిలాల్, సీఐ, త్రీటౌన్ పోలీస్ స్టేషన్

● గొంతు తడవక సొమ్మసిల్లి...



నెమలిని పోలీసులకు అప్పగిస్తున్న రైతులు

పుట్టపర్తి: గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీరు దొరక్కపోవడంతో ఓ మామిడి తోటలో వాలిన జాతీయ పక్షి నెమలి... అక్కడే సొమ్మసిల్లి పడిపోయింది. బుక్కపట్నం గ్రామానికి చెందిన రైతు చిత్రా నారాయణస్వామి తోటలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. విపరీతమైన దాహంతో సొమ్మసిల్లిన నెమలిని గమనించిన కొత్త చెరువుకు చెందిన విశ్రాంత సైనికోద్యోగి రవిచంద్ర వెంటనే దానికి సపర్యలు చేపట్టారు. బిందెలతో నీటిని దానిపై పోసిన కాసేపటికి తేరుకుంది. అయినా పైకి స్వేచ్ఛగా ఎగరలేక ఇబ్బంది పడుతుంటే రైతు నారాయణస్వామితో కలసి పోలీసులకు అప్పగించారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో గొంతు తడుపుకునేందుకు మూగజీవాలు పడుతున్న ఇబ్బందులకు ఇదొక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి ఘటనలో కోకొల్లలుగా చోటు చేసుకుంటున్నా.. వెలుగులోకి కొన్ని మాత్రమే వస్తున్నాయి. సకాలంలో రైతులు గుర్తించడంతో నెమలికి ప్రాణాపాయం తప్పింది.

ధర్మమార్గంలో పయనిస్తేనే సార్థకత



సంగీత కచేరీ నిర్వహిస్తున్న ఘటమ్ కార్తీక్ బృందం



అతిరుద్ర మహాయజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు



భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న డాక్టర్ శ్రీపాద సుబ్రహ్మణ్యం శాస్త్రి

ప్రశాంతి నిలయం: ధర్మ మార్గంలో పయనిస్తేనే మానవ జీవితానికి సార్థకత చేకూరుతుందని డాక్టర్ శ్రీపాద సుబ్రహ్మణ్యం శాస్త్రి పేర్కొన్నారు. ప్రశాంతి నిలయంలో అతిరుద్ర మహాయజ్ఞం ఆరో రోజు ప్రశాంతి నిలయం సాయి కుల్వంత్ సభా మందిరంలో కొనసాగింది. ఉదయం వేదపండితులు వేదపఠనం నడుమ అతిరుద్ర మహాయజ్ఞ క్రతువులను నిర్వహించారు. సాయంత్రం వేదపండితుడు డాక్టర్ శ్రీపాద సుబ్రహ్మణ్యం శాస్త్రి అతిరుద్ర మహాయజ్ఞం విశిష్టతను వివరించారు. అతిరుద్ర మహాయజ్ఞం అగ్ని దేవుడిని మిక్కిలి సంతృప్తి పరిచి విశ్వశాంతిని ప్రసాదిస్తుందో చక్కగా వివరించారు. మనుధర్మం మేరకు మానవుడు ధర్మ మార్గంలో, చట్టబద్ధమైన జీవితాన్ని ఎలా జీవించాలో వివరించారు. వేదాలు అందించిన సందేశం మేరకు ధర్మం అత్యంత పవిత్రమైన, శక్తివంతమైన ఆచారం మానవుని వెంట జంటగా ఉంటూ ఎలా రక్షిస్తుందో తెలియజేశారు. అనంతరం హిందూస్థానీ సంగీత విద్వాంసుడు కలైమణి డాక్టర్ ఘటమ్ కార్తీక్ బృందం సంగీత కచేరీ నిర్వహించారు. పరమేశ్వరుడిని, సాయీశ్వరుడిని కీర్తిస్తూ చక్కటి భక్తిగీతాలు ఆలపించారు.